క్లుప్తంగా

ముమ్మరంగా రీసర్వే పనులు



శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు రెవెన్యూ గ్రామంలో రైతుల సమక్షంలో రెవెన్యూ అధికారులు సారథ్యంలో రీసర్వే పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు తహసీల్దారు కె.సుజాత తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ గ్రామపరిధిలో 4500 ఎకరాలు భూములు ఉండగా ప్రభుత్వ నిబంధనలు మేరకు తొలిదశలో ప్రభుత్వ భూములు గ్రామ సరిహద్దులను గుర్తించామన్నారు. పొలాల యజమానులకు ముందుగానే నోటీసులు అందజేసిన తదుపరి రైతు సమక్షంలో రోవర్ యంత్ర పరికరం ద్వారా భూములు కొలతలు రీసర్వే పనులు చేస్తున్నట్లు తెలిపారు. పొలాల గట్ల వివాదాలకు తావులేకుండా రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్న నివృత్తి చేసుకోవాలన్నారు. సర్వే పనుల్లో డిప్యూటీ సర్వే అధికారి పేరిసోముల నాసరయ్య, సర్వేయర్ రాజు, వీఆర్వో ఉప్పులూరి చిన మంగయ్య, సచివాలయ సర్వేయర్ గురుబ్రహ్మం రైతులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ



నాదెండ్ల: వృద్ధులు, అనాథలను ఆదుకోవటం సామాజిక సేవలో భాగమని గణపవరం బ్యాంక్ ఆఫ్‌బరోడా బ్రాంచి మేనేజర్ పి.జయకర్ చెప్పారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా గణపవరం తులసీవనం వృద్ధాశ్రమంలో గురువారం 30 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవం, స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ బ్యాంకులో విద్య, వ్యవసాయ, వాణిజ్య, గృహ, కారు తదితర రుణాలు, బంగారంపై ఋణాలు తక్కువ వడ్డీకే అందిస్తున్నట్లు తెలిపారు. ఋణాలు నిర్దిష్ట కాలపరిమితిలోగా చెల్లించినట్లయితే వడ్డీ రాయితీలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ జాయింట్ మేనేజర్ కె.నాగయ్య, ఫీల్డ్ ఆఫీసర్ ఐనవోలు అమీమ, సిబ్బంది పాల్గొన్నారు.

ముళ్లకంప.. తొలగింపు ఇలా...



శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో ప్రభుత్వ వ్యయంతో నిర్మించిన చెత్త సంపద కేంద్రం నిరుయోగంగా మారి ముళ్ళకంపలతో మూసుకు పోయిందని గ్రామ మాజీ సర్పంచ్ ముంద్రు హనుమంతరావు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు పంచాయతీరాజ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు పంచాయతీ నిధులతో చెత్త సంపద కేంద్రంలో పరిధిలో ఉన్ననటువంటి ముళ్ళకంపలు, పిచ్చి చెట్లను ప్రొక్లయిన్ ద్వారా తొలగించే పనులను పంచాయతీ కార్యదర్శి బాల పరమేశ్వరరావు సారథ్యంలో పనులు జరుగుతున్నాయన్నారు. వారం రోజుల వ్యవధిలో పనులు పూర్తి చేసి చెత్త సంపద కేంద్రం అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వినుకొండ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్



నరసరావుపేట: స్థానిక వినుకొండ రోడ్డులో రోడ్ల మార్జిన్, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన కట్టడాలు, బంకులను మున్సిపల్ అధికారులు గురువారం తొలగించారు. నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్ పనులను కమిషనర్ ఎం.జస్వంతరావు స్వయంగా పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆక్రమణదారులతో కమిషనర్ మాట్లాడుతూ వీటిని తొలగించాలని గతంలోనే హెచ్చరించామని, కొంతమంది స్వచ్ఛందంగా తొలగించగా, మరికొంతమంది ఖాతరు చేయకుండా వ్యాపారాలు చేస్తున్నారన్నారు. రాబోయే కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా సదరు ఆక్రమణల వలన ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని, వీటిని నిత్యం తొలగిస్తామని హెచ్చరించారు.

పదిలో మంచి ఫలితాలు సాధించాలి

నాదెండ్ల: విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని గోల్కొండ గ్రూపు సంస్థల ఛైర్మన్, విద్యాదాత నడికట్టురామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. పరీక్షా సమయాల్లో పౌష్టికాహారం తీసుకోవాలని, క్రమబద్ధ ప్రణాళికతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుందరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుకు పగాకు!

- అంతంత మాత్రంగానే అంతర్జాతీయ మార్కెట్ ఆర్డర్లు
- ఖర్చులు పెరిగి పొగాకు రైతన్న సతమతం
- ఈ ఏడాది నష్టాలపాలయ్యే ప్రమాదం

సాగు పెరిగినా.. తగ్గిన ధరలు



నాదెండ్లలో ఏపుగా పెరిగిన పొగాకు తోటలు

నాదెండ్ల: ఈ ఏడాది వాణిజ్య పంటల సాగు రైతులకు నష్టాలు మిగిల్చింది. రబీలో పొగాకు సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరగటం, మార్కెట్లో ధరలు సగానికి సగం పడిపోవటంతో రైతులకు నష్టాలు తప్పేలా లేవు. ఒక్కో ఎకరాకు రూ.50 వేల నుంచి లక్ష వరకూ నష్టపోయే పరిస్థితి నెలకొంది. అంతర్జాతీయ మార్కెట్లో ధరలకు అనుగుణంగా దేశీయంగా ధరలు ప్రభావితమౌతాయి. ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్లో ఆర్డర్లు తక్కువగా ఉండటం, గతేడాది కన్నా ధరలు పడిపోవటంతో పొగాకు రైతులకు పరిస్థితులు ఆశాజనకంగా కనిపించటం లేదు.

పెరిగిన సాగు విస్తీర్ణం

గడిచిన ఐదేళ్లలో మండలంలో ప్రతి ఏడాది 150 ఎకరాల వరకూ సరాసరిన పొగాకు సాగవుతుంది. పొగాకు ధరలు బాగుండటంతో గతేడాది 330 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది పొగాకు విస్తీర్ణం 511 ఎకరాలకు పెరిగింది. నల్లబర్లీ రకం సాగు అధికంగా ఉంది. గతేడాది నల్లబర్లీ ధర క్వింటాకు రూ.15-17 వేల వరకూ పలికింది. ఈ ఏడాది రూ.8-10 వేల వరకూ మాత్రమే పలుకుతోంది. గుల్లపొగాకు గతేడాది రూ.8 వేల ధర ఉండగా, ఈ ఏడాది రూ.3500లకు పడిపోయింది. గతేడాది సగటున ఎకరాకు 12-14 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈ ఏడాది దిగుబడి తగ్గి 10-12 క్వింటాళ్లు మాత్రమే వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

పెరిగిన సాగు ఖర్చులు

ఈ ఏడాది సాగు ఖర్చులు భారీగా పెరిగాయి. గతేడాది కూలి రూ.600-700 ఉండగా, ప్రస్తుతం రూ.800-850లకు పెరిగాయి. కౌలు, నారు కొనుగోలు, బలం, పైపాటు మందులు, ఆరుతడుల ఖర్చులు కలిపి ఎకరాకు రూ.80-90 వేలు అవుతున్నాయి. అయితే ఈ ఏడాది ఫెంగల్ తుఫాను పత్తి పంటపై తీవ్ర ప్రభావం చూపింది. కాయలు, పూత, పిందెలు రాలిపోయి దిగుబడి భారీగా తగ్గింది. రైతులు పత్తిని పీకేసి పొగాకు సాగుకు మళ్లారు. దీంతో పొగాకు సాగు విస్తీర్ణం పెరిగింది.

వేధిస్తున్న కూలీల కొరత

గతేడాది కన్నా ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో పొగాకు సాగు చేయటంతో కూలీల కొరత



పందిళ్లలో ఆరబెట్టిన పొగాకు

ఏర్పడింది. ఆకు కొట్టుడు, పందిళ్ల ఏర్పాటు, తాళ్లకు గుచ్చి ఎండగట్టడం వంటి పనులకు కూలీలు దొరకటం లేదు. పొగాకు సంబంధించిన పనులకు కొంతమేర నైపుణ్యం ఉన్న కూలీలు అవసరం. కేజీన్నర ఉండే తాడుకు ఆకు కొట్టి, గుచ్చి, పందిళ్లకు వేలాడేసినందుకు రూ.50ల చొప్పున కూలీ చెల్లిస్తున్నారు. అయితే కూలీల కొరత కారణంగా ఆకు వృథా కావటం, నాణ్యత లోపించటంతో నష్టం కలగొచ్చని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నష్టం తప్పేలా లేదు



ఈ ఏడాది ఎకరంలో పొగాకు సాగు చేశా. రూ.70 వేల వరకూ ఖర్చయింది. 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని ఆశిస్తున్నా. అయితే ధరలు మాత్రం ఆశాజనకంగా లేవు. పెరిగిన ఖర్చులతో పోలిస్తే ధరల పతనం కారణంగా నష్టం తప్పేలా లేదు.

–తొండాపు వెంకటేశ్వర్లు, గణపవరం.

దిగుబడి తగ్గింది



పదమూడు ఎకరాలు కౌలుకు తీసుకుని పొగాకు, మరో 30 ఎకరాల్లో కంది సాగు చేశా. గతేడాది కన్నా ఈ ఏడాది దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఎకరాకు గతేడాది 14 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈ ఏడాది 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

–తొండెపు సాంబశివరావు, గణపవరం.

కూలీ ధరలు పెరిగాయి



పదెకరాల్లో నల్లబర్లీ సాగు చేశా. పొగాకు సాగులో కొంతమేర నైపుణ్యం ఉన్న కూలీలు అవసరం. గతేడాది కూలీ రూ.600 ఉండగా, ఈ ఏడాది రూ.800లు చెల్లిస్తున్నాం. సమయానికి కూలీలు దొరకటం లేదు. దీంతో ఆకు నాణ్యత తగ్గే ప్రమాదం ఉంది.

–పెనుమల నాగేశ్వరరావు,గణపవరం.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం



రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో వేంచేసియున్న బాల త్రిపుర సుందరీ సమేత శంకరస్వామి (శివాలయం) ఆలయ పునఃప్రతిష్ఠా 6వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని మూలవిరాట్‌లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహన్యాసక పూర్వక రుద్రాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు ఆలయ ప్రధానార్చకులు రొంపిచర్ల శ్రీనివాసశర్మ నిర్వహించగా ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పోస్టల్ సేవల గురించి అవగాహన

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని సబ్ పోస్టాఫీస్ కార్యాలయ ఆవరణలో వినుకొండ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, సిబ్బందికి నరసరావుపేట సూపరింటెండెంట్ పి. వెంకటస్వామి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఎంవీ సురేష్, ఎస్‌పీ ఎం. పద్మజ, ఎంఓ-1 సీహెచ్ వీరారెడ్డి, ఎంఓ-2 కేఎస్‌ఆర్ లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు

సబ్‌జూనియర్స్‌లో ప్రకాశం జిల్లా జతకు ప్రథమస్థానం



మొదటిస్థానం సాధించిన ముప్పాళ్ళకు చెందిన ఎం శేషాద్రిచౌదరి ఎడ్ల జత

నాదెండ్ల: నాదెండ్ల-గణపవరం డొంక రోడ్డులో కొలువైయున్న నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు గురువారం హోరాహోరీగా జరిగాయి. బుధవారం రాత్రి సబ్‌జూనియర్స్ విభాగంలో 12 జతలు పాల్గొన్నాయి. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి జూనియర్స్ విభాగంలో పోటీలు జరిగాయి.

సబ్‌జూనియర్స్ విభాగంలో విజేతలు

సబ్‌జూనియర్స్ విభాగంలో 12 జతలు పాల్గొన్నాయి. ప్రకాశం జిల్లా మద్దిరాల ముప్పాళ్ళకు చెందిన పుచ్చకాయల శేషాద్రి ఎడ్ల జత 3611 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా డీవీబీ బుల్స్, మద్దిరాల ముప్పాళ్ళకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి కంబైండ్ జత 3075 అడుగుల దూరం లాగి రెండో స్థానంలో నిలిచాయి. కృష్ణా జిల్లా పులిపాక గ్రామానికి చెందిన జీఎస్‌ఆర్ బుల్స్ గరికపాటి శ్రీధర్ ఎడ్ల జత 3056 అడుగుల దూరం లాగి మూడోస్థానంలో నిలిచాయి. కృష్ణా జిల్లా మల్లవల్లి గ్రామానికి చెందిన ఏవీఆర్ బుల్స్ అక్కినేని ముఖుల్‌సత్య చౌదరి ఎడ్ల జత 3006 అడుగుల దూరం లాగి నాలుగో స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా గంగన్నపాలెంకు చెందిన యూఎస్‌ఆర్ బుల్స్ ఉమ్మారెడ్డి శ్రీవల్లి ఎడ్ల జత 2500 అడుగుల దూరం లాగి ఐదోస్థానంలో, పల్నాడు జిల్లా రూపెనగుంట గ్రామానికి చెందిన వీఎస్‌ఈ హాస్పటల్స్ వారి జత 2355 అడుగుల దూరం లాగి ఆరో స్థానంలో, బాపట్ల జిల్లా రేపల్లె పట్టణానికి చెందిన సుఖవాసు సతీష్‌బాబు ఎడ్ల జత 2325 అడుగుల దూరం లాగి ఏడోస్థానంలో, గుంటూరు జిల్లా లింగాయపాలెం గ్రామానికి చెందిన ఎల్లం సాంబశివరావు జత 2319 అడుగుల దూరం లాగి ఎనిమిదో స్థానంలో, గుంటూరు జిల్లా లింగాయపాలెంకు చెందిన తొండెపు వెంకటేశ్వర్లు ఎడ్ల జత 2005 అడుగుల దూరం లాగి తొమ్మిదో స్థానంలో నిలిచాయి. ఎడ్ల యజమానులకు నిర్వాహకులు షీల్డ్, నగదు అందించారు. వ్యాఖ్యాతలుగా గూడా శ్రీనివాసరావు, తంగెడ హసన్ వ్యవహరించారు.

ఎస్‌ఎస్‌కే హోటల్ 7ఇన్‌కు అవార్డు

అవుట్ స్టాండింగ్ కాంక్రీట్ స్ట్రక్చర్ అవార్డు అందుకున్న హోటల్ ప్రతినిధులు



అవార్డు స్వీకరించిన కమలాకరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి

నరసరావుపేట: స్థానిక రావిపాడురోడ్డులో ఇటీవలనే ప్రారంభమైన ఎస్‌ఎస్‌కే హోటల్ 7ఇన్‌కు వాణిజ్య విభాగంలో రాష్ట్రస్థాయి అవుట్‌స్టాండింగ్ కాంక్రీట్ స్ట్రక్చర్ అవార్డు లభించింది. ఈ మేరకు బుధవారం రాత్రి విజయవాడ హయాత్ ప్లేస్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నిర్మాణదారుడు గడ్డం వెంకటేశ్వరరెడ్డి, హోటల్ నిర్మాణానికి ఇంజినీరుగా పనిచేసిన విజయలక్ష్మి ప్లానర్స్ అండ్ ఆర్కిటెక్స్ అధినేత కొమ్మసాని కమలాకరరెడ్డికి ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ (ఐసీఐ) విజయవాడ చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ వెంగల జగదీశ్, ఐఐటీ హైదరాబాదు ప్రతినిధి డాక్టర్ కేవీఎల్ సుబ్రమణ్యం, అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ జి.సురేష్‌కుమార్, ఇంజినీరు ఐ.కోటిరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా కమలాకరరెడ్డి మాట్లాడుతూ అవార్డులు పొందడం వృత్తిపరంగా మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుందన్నారు. ఇది నిర్మాణ రంగంలో తమ నిబద్ధత, ఉత్తమతకు గుర్తింపుగా భావిస్తున్నా మన్నారు. ఈ గౌరవాన్ని అందించిన విజయవాడ ఐసీఐ, అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఐసీఐ విజయవాడ చాప్టర్ సభ్యుడు వి.రామకృష్ణప్రసాద్, రాష్ట్ర లైసెన్స్‌డ్ ఇంజనీర్స్-సర్వేయర్స్ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలియచేశారు.

సంక్షిప్త వార్తలు

స్పా సెంటర్‌లో తనిఖీలు

నరసరావుపేట రూరల్: కేసానుపల్లి పరిధిలోని ఎల్‌టి నగర్‌లో స్పా సెంటర్‌లో బుధవారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమతి లేకుండా స్పా సెంటర్ నిర్వహిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు స్పా సెంటర్ నిర్వాహకుడితో పాటు ముగ్గురు యువతులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ కిశోర్ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం శివారులో పేకాట శిబిరంపై రూరల్ పోలీసులు గురువారం దాడి చేశారు. పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో రూరల్ ఎస్‌ఐ కిశోర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి ఏడుగురిని అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.4,500ల నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపాడు.

ఏబీసీ కెనాల్ పడి పోట్లూరు వాసి మృతి

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామానికి చెందిన తూమాటి రామాంజినేయులు (75) కాల్వలో పడి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు తెలిపిన వివరాలు మేరకు ఇటీవల తూమాటి రామాంజినేయులు అనారోగ్యంతో బాధపడుతుండగా తన కూతురు ఇంటికి వెళ్ళి చూపించుకొని ఈనెల 4న స్వగ్రామం పోట్లూరుకు బయలుదేరాడు. అయితే అప్పటి నుంచి ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు పిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా నమోదు చేశామన్నారు. ఈక్రమంలో గంటావారిపాలెం గ్రామ సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో గురువారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి మృతుడి వివరాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పార్శిల్ వాహనం ఢీకొని ఎలక్ట్రీషియన్‌కు గాయాలు

నాదెండ్ల: గుంటూరు-కర్నూలు రహదారిపై సాతులూరు రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు తిరంగాపురం గ్రామానికి చెందిన చెరుకూరి వెంకటకృష్ణ ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుంటాడు. ఫిరంగిపురం నుంచి ద్విచక్ర వాహనంపై నరసరావుపేటకు వెళ్ళే క్రమంలో రైల్వేస్టేషన్‌కు వచ్చే సరికి పార్శిల్ వాహనం ఢీకొంది. దీంతో వెంకటకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారమివ్వడంతో క్షతగాత్రుడిని నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పార్శిల్ వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

హెవీ డ్రైవింగ్ అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేత



నరసరావుపేట: స్థానిక డిపోలో నిర్వహిస్తున్న ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్ ట్రైనింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసుకొన్న 18వ బ్యాచ్ డ్రైవర్ అభ్యర్థులకు డైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్, డిపో మేనేజర్ జీఎస్‌ఎస్‌వి కుమార్ గురువారం సర్టిఫికేట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకున్న వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపరాదని సూచించారు. 19వ బ్యాచ్‌కి అడ్మిషన్స్ జరుగుతున్నందున లైట్ లైసెన్సు కలిగిన డ్రైవర్లు హెవీ లైసెన్స్ పొందేందుకు తమ దగ్గర శిక్షణ తీసుకున్నట్లయితే మెరుగైన అవకాశాలు లభిస్తాయని డిపో మేనేజర్ పేర్కొన్నారు.

జాతీయ నులిపురుగుల దినోత్సవంపై సమీక్ష



రొంపిచర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఈ నెల 10న వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీ య నులిపురుగుల దినోత్సవంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎండీఓ కె.మ్యాథ్యూబాబు మాట్లా డుతూ ఈ నెల 10న మండలంలో నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. 10వ తేదీన మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థినీ, విద్యార్థులకు అంగన్వాడీ కేంద్రాలల్లోని పిల్లలకు తప్పనిసరిగా నులిపురుగుల నివా రణ మందులు పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అందరూ హాజరయ్యేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయ న ఆదేశించారు. అనంతరం నులిపురుగుల దినోత్సవ గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, ఎంఇఓ డి.బ్రహ్మేశ్వరరావు, ఐసీడీయస్ సూపర్ వైజర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో విధులు నిర్వహించాలి

ఉపాధ్యాయులకు ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి సూచన



ఉపాధ్యాయునితో మాట్లాడుతున్న ఆర్జేడీ, డీఈవో

శావల్యాపురం: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహించటంతో పాటు సమయపాలన పాటించాలని ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండంలోని పోట్లూరు, వేల్పూరు గ్రామాల్లో జడ్పీ ఉన్నత పాఠశాలల, ఎంపీపీ స్కూల్స్‌ను ఆర్జేడీ, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సంయుక్తంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుదలకు ఉపాధ్యాయులు కృషి చేయటం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు మెను ప్రకారం జరిగేలా ఆయా పాఠ శాలల ప్రధానోపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. బడికి సక్రమంగా రానటువంటి విద్యార్థులను గుర్తించి సమాచారాన్ని సకాలంలో తల్లిదండ్రులకు తెలియజేసి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్. చంద్రకళ మాట్లాడుతూ త్వరలో జరగనున్న పదోవ తరగతి ఫైనల్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించటానికి ఉపాధ్యాయులు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఉపాధ్యా యులు క్రమశిక్షణతో కూడిన గుణాత్మక విద్యను బోధించాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరును వంటకాల రుచిని స్వయంగా పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు సింగంశెట్టి అన్నపూర్ణమ్మ, షేక్ మహమ్మద్ సుభాని, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రత్యేక బృందాలతో పన్నుల వసూళ్లు

- మార్చి 31 నాటికి వందశాతం వసూళ్లే లక్ష్యం
- మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

నరసరావుపేట: పురపాలక పరిధిలో ఆస్తిపన్ను, నీటి కుళాయి పన్నుల వసూళ్లపై సచివాలయ, మున్సిపల్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ అతిథి గృహంలో మార్చి 31నాటికి పన్నులు వసూళ్ల వందశాతం లక్ష్యంపై సచివాలయ పరిపాలనాధికారులు, రెవెన్యూ సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. బకాయిలు ఉన్న ప్రతి ఒక్క యజమాని పన్నులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే జీఐఎస్ సర్వేలో గుర్తించిన అసెస్ చేయని, అసెస్ చేసేందుకు వీలుగాని వారిని ఈనెల 28లోగా దరఖాస్తులు పూర్తిచేయాలని అన్నారు. రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇనస్పెక్టర్లు బెయిలీబాబు, సయ్యద్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

జీనోమిక్ డీఎన్‌ఏ విశ్లేషణపై సదస్సు



సదస్సులో పాల్గొన్న కళాశాల పాలకవర్గం, రీసోర్స్‌పర్సన్స్

నరసరావుపేట రూరల్: శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలోని వీఎస్‌ఆర్ అవధాని సెమినార్ హాల్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నిక్స్ ఇన్ జీనోమిక్ డీఎన్‌ఏ అండ్ హెచ్‌పీఎల్‌సీ మెథడ్స్‌పై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్తాలు వర్క్‌షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. రీసోర్స్‌పర్సన్స్‌గా జేఎన్‌టీయూకే కెమిస్ట్రీ బయో టెక్నాలజీ అధ్యాపకుడు డాక్టర్ సి.హెచ్.చంద్రశేఖర్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బయో టెక్నాలజీ అధ్యాపకుడు డాక్టర్ డి.శ్రీనివాసరావు, జేకేసి బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం.గురవయ్యలు పాల్గొన్నారు. శరీరంలోని ప్రతి జీవకణంలో ఉండే డీఎన్‌ఏ మన శారీరక లక్షణాలను తరువాత తరాలకు అందజేస్తాయని తెలిపారు. జీనోమిక్ డీఎన్‌ఏ విశ్లేషణ అనే పద్ధతి పరిశోధనలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. జీనోమిక్ డీఎన్‌ఏ విశ్లేషణలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, జువాలజీ విభాగాధిపతి ఐ.సదాశివరెడ్డి, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీనివాసరావుపాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామూహిక బాధ్యత

యడ్లపాడు: పల్లెల పరిశుభ్రత'-జలసంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో వి హేమలత దేవి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘన, ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐటిసి, చిలకలూరిపేట అసిస్ట్ స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో హేమలతాదేవి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత నిర్వహణ అధికారులు, క్లాప్ మిత్రల బాధ్యత మాత్రమే కాదని, మండల ప్రజలు కూడా భాగస్వామ్యం అయినప్పుడే పల్లెల పరిశుభ్రత సంపూర్ణంగా సాధించే వీలుంటుందని పేర్కొన్నారు. అనంతరం స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ ఫ్యాకల్టీ డాక్టర్ మోహన్‌రావు గ్రామీణ ఘన ద్రవ్య వ్యర్థ పదార్థాల నిర్వహణ, తడిపొడి చెత్తల విభజనపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ షేక్ జాకీర్ హుస్సేన్, ఐ టి సి, అసిస్ట్ సంస్థల ఇంజనీర్ నజీర్ కమ్యూనిటీ మొబిలైజర్ షేక్ బాజి, కోఆర్డినేటర్ వెంకయ్య, వెంకటశివ, ఏవో కేఎస్‌వీ సాయి శ్రీనివాస్, శశికళ, 52 మంది క్లాప్‌మిత్రలు, 18 కార్యదర్శులు పాల్గొన్నారు.